కథానిక:

ప్రాణభిక్ష

శ్రీ "జయంతి"

"వెంకట్రావుగారూ! ఈవేళ నావొంట్లో బొత్తిగా బాగా లేదు. పార్టీ లెవరొచ్చినా మీరే సమాధానం చెప్పి పంపెయ్యండి"

"చిత్తం. అన్నట్లు ఈవేళ విశ్వనాథంగారు కూడా వస్తారండి. ఆయనైనా మీదగ్గిరికి..."

"వద్దండి. మీరే ఏదో సముదాయించి పంపేద్దురూ."

వెంకట్రావు తన ప్లీడరు అడుగుజాడలకి అరంగుళమైనా తప్పని గుమాస్తా. కొందరు అతన్ని హనుమంతు డంటారు. కొందరు జడభరతు డంటారు. కొందరు కేసబియాంకా అంటారు. ఆవన్నా గోవన్నా పసువొక్కటే కద! సత్యమూర్తికి కూడా అలాంటి గుమస్తామీద అభిమానం లేకండా ఎలా పోతుంది? అంత నమ్మకస్థుడు లేకపోతే అమ్మాణివ్యవహారం ఎంత రసభాస అయివూరుకునేదో! అతని చాకచక్యాన్ని అమ్మాణి ఎన్నోసార్లు స్వయంగా ప్రశంసించింది. అంతటి సిద్ధహస్తుడు లేకపోతే కుప్పలు కుప్పలుగా పెరిగే దస్త్రాలు ఏమూల పడివుండేవో! ఈనాడు చాకలిపద్దులనుండి కూరల ఖర్చువరకూ అద్దాలబీరువాలలో అందంగా అమర్చబడివున్నాయి. అంతటి మితవ్యయుడే తన గుమస్తా కాకపోతే లెక్కాపత్రం లేకుండా వచ్చే తన రూపాయలు ఎందరు మింగేసేవాళ్లో! చందాదారుల్నీ, సాతాని భక్తుల్నీ కూడా ఒక్కకానీ ఖర్చులేకుండా నోటితోనే సంతోషపెట్టి పంపేస్తాడు వెంకట్రావు.

సత్యమూర్తి లోనికిపోయి ముసుగు పెట్టుకు పడుకున్నాడు. వెంకట్రావు ఆఫీసుగదిలో వంటరిగా కూర్చున్నాడు. చెవులో పెన్సిలు పెట్టుకుని వెర్రిగా యోచిస్తున్నాడు. అతని మనస్సు కాలుకాలిన పిల్లిలా పరుగెత్తుతోంది. తన ప్లీడరుగారి వంట్లో బాగాలేదు. పాపం, ఆయనకే సరిగా లేకపోతే ఎందుకి పార్టీలు, ఝుంఝూటం. తన ప్లీడరు ధర్మాత్ముడు. నెల ఒకటో తేదీ వచ్చేసరికల్లా ఏ భయి రాళ్లూ అడక్కుండానే పడవేస్తాడు. ఎప్పుడైనా చిల్లర తాను వాడుకున్నా ఏమీ అనడు. తన యింట్లో తోరణం కట్టుకుంటే సరి పాతికో పరకో ముట్టచెబుతుంటాడు. గొప్పవాళ్లల్లో ఈనాడు ఇంత దయగలవాళ్లు ఎక్కడ దొరకుతారు? అలాంటి మహానుభావుడు ఈనాడు శరీరంలో బాగుండక బాధపడుతున్నాడు. పాపం - రెండురోజులనుండీ డాక్టరు భీమారావుగారిని కలుసుకుంటున్నా ఇంకా నయం కాలేదు. పైగా చాలా నీరసించిపోయాడు. దేవుడు తప్పక మేలుచెయ్యాలి.

"ప్లీడరుగా రున్నారాండి?"

"ఏం? ఎందుకు?"

"కావాలి. పనుంది ఆయనతో అర్జంటు"

"ఉన్నారు, కాని ఆయనవొంట్లో బాగాలేదు. లోపల నిద్రపోతున్నారు. ఆపనేదో నాతో చెప్పండి. నేనాయన హెడ్డు గుమాస్తాను."

"వెంకట్రావుగారంటే మీరేనా?"

"అవును. నాపేరు మీ కెల్లా తెలుసు?"

"తెలుసులెండి. ఈ వుత్తరం రహస్యంగా ప్లీడరుగారికియ్యండి. ఇంకేం చెప్పనక్కరలేదు." అంటూ ఆగంతుకుడు నడచిపోయాడు.

వెంకట్రావు ఆశ్చర్యపోతూ అలాగే చూస్తున్నాడు. ఈఆగంతుకు డెవరు? ఏంపని? చేతులో కవరు చూచేడు. పైన దస్తూరీ అమ్మాణిదిలా వుంది. ఇప్పుడేమిటి చెయ్యడం? ప్లీడరు ఎవర్నీ పంపవద్దన్నాడు కాని, తనని రావద్దన లేదే. ఉత్తరాలేవీ తేవద్దన లేదే. పైగా, ఇలాంటి రహస్య సమాచారాలు? ఇలా గనుకుంటూ లేచేడు. నాలుగడుగులు వేసి ఆగిపోయాడు. ఒకవేళ దారిలో కాంతమ్మగారు తటస్థపడి "ఈవుత్తరం నేనే యిస్తాను. మీరు వెళ్లండి" అంటే? అంతకంటే ప్రమాదముందా? అలాగే మొక్కలకేసి చూస్తూ నిలబడ్డాడు. అతని మేధస్సులో ఎన్నోవింతలు తిరిగి పోతున్నాయి. ఎందుకో నిన్నరాత్రి తన కుమారుడు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. "నాన్నా, గుమస్తాగిరీ గాడిదబ్రతుకు లాంటిది. నేనలాంటి నౌకరీ చెయ్యలేను. వ్యాపారం చేస్తాను" అన్నాడా పసి కుర్రవాడు.

అతని మాటల్లో అంతరార్థం తెలిసినట్లయింది వెంకట్రావుకి. ఇంతలో మళ్లీ ఒక ఆలోచన తట్టింది. ఉత్తరం కోటుజేబులో పెట్టుకుని తిన్నగా ప్లీడరుగారి మంచం సమీపించేడు. సత్యమూర్తి ముసుగులో మూలుగుతున్నాడు. కాళ్ల చప్పుడువిని, ముసుగు కొంచెం సడిలించి "ఏం, వెంకట్రావుగారూ?" అన్నాడు.

వెంకట్రావు వెర్రిగా ఉత్తరం అందిచ్చేడు. సత్యమూర్తి కళ్లు ఎందుకో మిలమిల లాడేయి. వెంకట్రావుకు వ్యథ తీసి పారేసినట్లయింది. ప్లీడరు చదువుకుని అతని కందిచ్చాడు. తనివిగా చదువుకున్నాడు వెంకట్రావు.

"ఈ సాయంత్రం ఆరుగంటలకి టౌన్ హాలులో మీ కోకిలగొంతు విప్పుతోంది. తప్పక వస్తారుగదూ!" ఆపతీరక మళ్లీ అందుకుని చదువుకుంటున్నాడు సత్యమూర్తి. కాంతమ్మ ఆదారిని పోతూ "ఎక్కడనుంచండీ వుత్తరం? మా నాన్నదగ్గరనుంచా" అంది.

"ఈ వెధవ పార్టీలు వేధించుకుతింటూరు. బ్రతకనివ్వరు" అంటూ చించేశాడు సత్యమూర్తి. కాంతమ్మ తన దారిని తాను పోయింది.

"వెంకట్రావుగారూ! ఆరుగంటలకి, మరవవద్దు" అన్నాడు ప్లీడరు తన గుమాస్తాతో.

సరిగ్గా ఆరుగంటలకి వెంకట్రావు ప్లీడరుతో బయలుదేరేడు. టౌనుహాలు సమీపించేసరికి లోపల కిటకిటలాడుతోంది జనసమ్మర్దం. అమ్మాణి గానసభ అప్పటికే ఆరంభమైపోయింది. ఎలాగో సత్యమూర్తి గుమస్తాతో ఓమూల కూలబడ్డాడు తివాసీమీద. అమ్మాణి ముసిముసిగా ఓ ఓర చూపు చూచింది. గానసభ మహోత్సాహాయమానంగా నడుస్తూంది. శ్రోతలలో మూడువంతులు తలలు వూగుతున్నాయి. అప్రయత్నంగా మద్దెలవాద్యకునితోసహా, కొందరు చప్పగా తాళం వేస్తున్నారు. అమ్మాణి అపర గానసరస్వతిలాగ వెలుగుతూంది. కాని సత్యమూర్తిమాత్రం బాధపడుతున్నాడు. అతనితో వెంకట్రావుకూడా కొంచెం మూలుగుతున్నాడు.

ప్లీడరూ, గుమస్తా తప్ప అందరూ గానామృతంలో తన్మయులై పోతూరు.

గానం సగంపైగా అయిపోయింది. సత్యమూర్తి ఇక ఉండలేకపోయాడు. అంతకన్న వెంకట్రావు ఎక్కువ బాధపడుతున్నాడు. ఇద్దరూ లేచి బయటకు వచ్చేశేరు. నాలుగడుగులు వేసి ఆగిపోయారు.

"వెంకట్రావుగారూ, నాపని అయిపోయింది. మాననివ్యాధికి గురి అయిపోయాను."

"అలా గనకండి. డాక్టరు భీమారావుగారిని కలుసుకుందాము నడవండి."

వద్దండి. ఆయన్ని మొన్ననే కలుసుకున్నా. అప్పటినుంచీ ఆయన చెప్పిన సింప్టమ్సు అన్నీ నాలో చూచుకుంటున్నాను. ఇప్పటికి అవన్నీ నాలో స్థిరం అయిపోయాయి. ఏం సందేహం లేదు. ఇక రోజులు లెక్కపెట్టుకోవడమే నాపని"

"ఏం వ్యాధి? ఏం సింప్టమ్సు, కొంచెం సెలవిస్తారా?"

"ఏముంది. మానాన్నగారిని ఏది మింగేసింది?"

"పక్షవాతమా?"

"అవును. అదే నాలోనూజీర్ణించి పోతూంది" మీ కెల్లాగ తెలుసు?"

"దాని కొక్కటే పెద్దలక్షణం, వెంకట్రావుగారూ ఏ అవయవానికైతే పక్షవాతం రాబోతోందో, ఆ అవయవం పట్టు తప్పుతుంది. దాన్నికోసినా నొప్పి తెలియదు. నాకాలు చూడండి. గంటసేపటినుండి చూస్తున్నాను. ఎంతగిల్లినా నాకు బాధ తెలియడంలేదు. తప్పకుండా పక్షవాతందెబ్బ దీనికి తగలబోతోంది గనుక"

వెంకట్రావుకి అప్రయత్నంగా చిరునవ్వు వచ్చింది. యుద్ధం గెలిచినవాడిలా విజయగర్వం పొందేడు ప్లీడరు అది చూచి కొంచెం కోపంతో—"ఏమిటి మీ వుద్దేశం?" అన్నాడు.

ఇంతేనాండి? ఇంత సేపటినుండీ సెలవిచ్చారు కాదు. అదే లక్షణమైతే మీవ్యాధి కుదిరినట్లే భావించుకోండి". అన్నాడు వెంకట్రావు ఎన్నడూరాని హుషారు తెచ్చుకుని.

"మీ భావం?"

"చాలా సులభమైందే. మీరు గంటసేపటి నుండీ గిల్లుతూన్నది మీకాలు కాదు. నాకాలు. ఆ ఇరుకులో మీకు తెలియలేదనుకుంటాను. మీ భావం గ్రహించుకోలేక గంటనుండీ కొట్టుకుంటున్నాను. పాట బాగుందని చెప్పడానికి అలా చేస్తున్నారేమో అనుకున్నాను. ఇదిగో చూడండి. ఎలాగ వాచిపోయిందో" అన్నాడు వెంకట్రావు.

సత్యమూర్తిసంతోషానికి మేరలేదు. తన వివేకవిహీనతని విమర్శించుకుందుకు కూడా అతనికి స్మితం లేదు.

"క్షమించాలి వెంకట్రావుగారు. మీరు నిజంగా నాకీనాడు 'ప్రాణభిక్ష పెట్టిన ట్లుంది' అంటూ గుమాస్తాను కౌగలించుకున్నాడు.

"కలౌ వేంకటనాయకః"

(11-వ పేజీ తరువాయి)

సింహద్వారము తెరువబడును. పడికావలి దాటిపోయిన లోపలిప్రక్క అక్బరుచక్రవర్తి యొక్క మంత్రి రాజా తోడరుమల్లుకుటుంబమునకు చెందిన విగ్రహములు ఉన్నవి. పడికావలిలో కుడివైపున శ్రీకృష్ణదేవరాయల, వారి భార్యలు తిరుమలదేవి చిన్నాదేవిగార్ల అద్భుత తామ్రవిగ్రహములును, ఎడమవైపున అచ్యుతరాయలు అతని భార్య వరదేయమ్మ శిలావిగ్రహములును గలవు. యాత్రికులు పడికావలి దాటి ధ్వజస్తంభమునకును దాని ప్రక్కనుండు క్షేత్రపాలకునకు నమోవాకము లర్పింతురు.

'ఆనంద నిలయము'

అర్చకులు దేవాలయద్వారముల తెరచునపుడు, మూయునపుడు, తాళముచెవులను క్షేత్రపాలకునకు తాకించిపోదురు. ముఖద్వారమునకు రెండోద్వారమునకు మధ్యనున్న ప్రదక్షిణమునకు సంపంగిప్రదక్షిణ మని పేరు. దీనిలో 'విరజ' అను చిన్న బావి శ్రీవారిపదములక్రింద ప్రవహించు 'విరజా' నదిభాగమని తెలుపబడుచున్నది. ఈ ప్రదక్షిణములో ఉన్న పూల బావికి స్వామికి సమర్పించిన పుష్పమాలను తులసిని సమర్పింతురు. రెండవద్వారము దాటిపోయిన ఎడల శ్రీవారి గర్భగృహముపై నున్న ఆనందనిలయవిమానము చుట్టివచ్చు విమాన ప్రదక్షిణము ఉన్నది. ఇందు శ్రీ యోగనరసింహస్వామి, శ్రీ వరదరాజస్వామి, భాష్యకార్ల గుడి సేనాధిపతినిలయము, గరుడాళ్వారు మందిరమును వకుళమాలానికేతనము కలవు కుడివైపున సంకీర్తనాచార్యులు శ్రీ తాళ్లపాక అన్నమయ్యగారి శిలామూర్తులు, వారి అమూల్యరచనలు ఉన్నగూళ్లు ఉన్నవి. శ్రీవారి ఆలయమునకు విమానప్రదక్షిణము గాక గర్భాలయము చుట్టును—వైకుంఠ ప్రదక్షిణము ఉన్నది. ముక్కోటి ఏకాదశినాడుమాత్రము దీన్ని తెరుస్తారు గర్భాలయము ముందుఉన్న ముఖమండపానికి బంగారువాకిలి అని పిలుస్తారు. ఈ వాకిలి కిరువైపులా జయవిజయులు ఉన్నారు.

ఎడమవైపున నివేదనసమయమున మ్రోగించు రెండు పెద్ద కంచుగంటలు ఉన్నవి. ఉత్తర పార్శ్వమున హుండీ, దానికిముందు పారుపత్యందారు కచేరి ఉన్నాయి. బంగారు వాకిలినుండి రెండు ద్వారములు దాటిన శ్రీవారిదర్శనము లభించును.

బ్రహ్మోత్సవం

శరత్కాలములో జరిగే ఉత్సవాన్ని బ్రహ్మోత్సవ మంటారు. స్వామివారు జన్మించిన శ్రవణానక్షత్రకాలమున ఈ ఉత్సవాలు అమితోత్సాహంతో జరుపబడుతాయి. నిఖిలభారతావనినుంచి యాత్రికులు తండోపతండములుగా వస్తారు. పుత్రులులేని దశరథుడు వశిష్ఠుని సలహా ననుసరించి స్వామిపుష్కరిణీప్రాంతముల తపస్సునకు విచ్చేశారట. స్వామివారు దశరథునికి సాక్షాత్కరించారు. సురలు, మునులు, భూసురులు కొలువుతీర్చిఉండగా బ్రహ్మప్రార్థనపై స్వామివారు ఉత్సవము చేయించుకొనుటకు అంగీకరించారనీ, ధ్వజారోహణపూర్వకంగా బ్రహ్మ తొలుత ఉత్సవం జరిపించినందున దీనికి బ్రహ్మోత్సవం అని పేరు వచ్చిందనీ శ్రీ వేంకటాచలమాహాత్మ్యములో ఉన్నది.

శ్రీ వరాహ క్షేత్రం

హిరణ్యాక్షుని వధానంతరం అవతారమూర్తి శేషాద్రిపై వెలసినారుగాని ఈ వరాహ క్షేత్రంలో నూరుపాదముల మేర భూమిని శ్రీనివాసమూర్తి వరాహస్వామినుండి పరిగ్రహించి అక్కడ ఉనికి కల్పించుకున్నారట. ఆసందర్భంలో చేసుకున్న ఒడంబడిక ననుసరించి కలియుగాంతంవరకూ వరాహస్వామికి ప్రప్రథమమున మంగళాభిషేకం, జరుగవలెనని ఏర్పాటు; అలాగే ఇప్పటికీ జరుగుతున్నది. శ్రీనివాసుని దేవాలయం అర్చనావిధానమంతా వైఖానసాగమానుసారంగా జర్గుతోంది.

స్వామివారు - అమ్మవారు

లోకానికంతకూ కల్యాణ ప్రదాత అయిన వేంకటేశ్వర పెరుమాళ్లు రంగరంగవైభవాలూ పొందుతూ ఉన్నా, భార్యలేని వంటరిజీవితం గడపడంమాత్రం క్లేశంగానే ఉంటుంది. అమ్మవారు ఎన్నియుగాలనాడో, ఏకారణంచేత అలిగి వెళ్లిందోగాని ఈనాటికీ ఆదాంపత్యం మళ్లా ఒక కుదిటికి రాలేదు. స్వామివారు ఎడనెడ రాత్రులవేళ తిరువిజయం చేయడమైనా అమ్మవారిమీద ప్రీతిచేత కాదు. అవతల ఎక్కడో ఉన్న బీబీనాంచారికోసం అనేది అమాయకులైన భక్తులకు మరింత అర్థంగాని విషయం. అంతా స్వామిలీల. గిరిమీద నెలకొన్న పెరుమాళ్లను చూచినా, మందారవనంలోఉన్న అలమేలుమంగను చూచినా భక్తి బాధా రెండూ కల్గుతవి. సమర్థుడైన గోవిందరాజస్వామి ఏ విషయమూ అంటీ ముట్టకుండా నిశ్చింతగా తలక్రింద మానికపెట్టుకొని పవ్వళించి ఉంటాడు కేరళ పద్మనాభునివలె.

జరగవలసిన పనులు

దివ్యస్థలమైనటువంటి తిరుపతికొండ మహత్తర ప్రభావవిలసితమైనప్పటికిన్నీ సామాన్య మానవదృష్టిలో అనగా కనీసపు సౌకర్యముల విషయాలలో అనాదిగా అధోగతిలోనే ఉన్నది. ఇటీవల మెరుపుదీపములంటూ, వైద్యానికి సహాయానికి మరికొన్ని సౌకర్యములంటూ బసలకు ఇంకొన్ని సౌకర్యములంటూ వెలసినా ఎటు చూసినా మురికిగా ఉండేటువంటి బాట, ప్రయాణానికి ఏమాత్రమూ అనువుగాని రథ్యలూ, పరిశుభ్రత అనే శబ్దమే కరవైన పట్టులు ఈనాటికీ - ఇంతే. తిరుమలగిరి శుచిశుభ్రతల విషయం శ్రద్ధ వహించవలసినటువంటి దేవస్థానం అధికారులు తమ బాధ్యతవిషయంలో ప్రమత్తులుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ విషయంలో నిర్ముక్తి లేనపుడు ప్రభుత్వం జోక్యం కల్గించుకోకతప్పదు. తలకుమాసిన సామాన్యమానవుడి మొదలుకొని, రాష్ట్రానికంతకూ ఆధిపత్యం వహించే ప్రధానమంత్రి, ప్రధానన్యాయమూర్తి వరకు ప్రతి ఆస్తికుడూ స్వామిదర్శనానికి ఒకసారో, వందసార్లో వెళ్లివచ్చినవారే వారెవ్వరికీ ఈ అపరిశుభ్రత కంట పడలేదా? లేక జోక్యం కల్గించుకుంటే స్వామివారికి అపచారముచేసినవారవుతామని మెదలకుండా ఊరుకున్నారా?

అంతవరకు ఎందుకు? తన వివాహం నిమిత్తమై ఏనాడో కుబేరుడివద్ద అప్పుచేసి అప్పుమొత్తమెంతో తేల్చక దానికి అయినవడ్డీ ఎంతో తేల్చక, ఈనాటికీ భక్తులచెవులనుండి వడ్డీకాసులు వసూలుచేస్తూన్న 'ధిషణావారిక్షీకుడు' అయినప్పటికీ, తనకోసం తన దివ్యదర్శనంకోసం ఏడుకొండలూ ఎక్కి కాళ్లు బలపాలుకట్టి కదిలివచ్చే భక్తులను కనికరించి అయినా వారికి వలసిన తగుబాటి సౌకర్యములు ప్రసాదించరాదా? తన పరిజనానికి ఆజ్ఞాపించి కల్పించరాదా? ఇదే పెరుమాళ్లకు మరియొకపరి విన్నపము.